# సుగంధం

రామకృష్ణ నిశ్చేష్టుడై కూర్చున్నాడు. కన్ను ఎటు తిప్పినా బాక్స్ కట్టి ప్రచురించిన ఆ వార్తే కనిపిస్తూంది.

నీరెండ మెట్లెక్కి పారాడుతూ అతని పాదాల్ని చేరుతూంది. ఇంటికి సమీపంలో ఉన్న ఆలయంలో నుండి భగవద్గీత శ్లోకాలు వినిపిస్తున్నాయి. ఫలితాన్ని గురించి పట్టించుకోకుండా నీ కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తించమని ఉద్బోధిస్తున్నాడు కృష్ణుడు. నిరాసక్తంగా ఉన్నప్పటికీ రామకృష్ణ చెవుల్లో గీతామృతం ప్రవహిస్తూంది.

అవును! ఇప్పటివరకు తన కర్తవ్యాన్ని తను సక్రమంగా నిర్వర్తిస్తున్నాననే నమ్మకంతోనే ఉన్నాడు తను. 'ఇతరులు నీపట్ల ఎలా వ్యవహరించాలని నువ్వు వాంఛిస్తున్నావో నువ్వు ఇతరుల పట్ల అలాగే వ్యవహరించు' అనే సర్వమతాల సూక్తిని మనసా, వాచా, కర్మణా ఆచరణలో పెట్టడానికే ప్రయత్నిస్తున్నాడు తను. కాని ఇప్పుడిలా ఎందుకు జరిగింది? ఎక్కడో ఏదో లోపం ఉంది. ఆత్మ పరిశీలన చేసుకుంటూ గతాన్ని స్పృశిస్తున్నాడు డాక్టర్ రామకృష్ణ.

మధ్య తరగతి మిథ్యా విలువలు సంకెళ్లవుతూ తను పుట్టిన కులం ప్రతి మెట్టుపైన అవరోధమవుతూ ఉండగా పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌ని పూర్తి చేసాడు తను. దాదాపు నలభై పల్లెటూళ్ళ కూడలి అయిన ఈ చిన్న పట్టణంలో ప్రాక్టీస్ పెట్టినపుడు ఆదర్శాలతో, ఆశలతో తూగుతున్నాడు తను. మంచిని, మానవత్వాన్ని నేను పరిమళింపజేస్తే ఆ సుగంధం లోకంలో సుళ్ళు తిరిగి రెట్టింపై వచ్చి నన్ను అలముకుంటుంది అని కలలు కన్నాడు తను. ఇన్నాళ్ళుగా తను సముపార్జించిన జ్ఞానాన్ని ప్రేమతో మెదిపి పన్నీరులా చిలికించడమే తన ధర్మమని గాఢంగా నమ్మాడు తను.

కానీ ప్రాక్టీస్ పెట్టిన పది రోజులకే తన కల చెదరడం ప్రారంభించింది. జీవిత వాస్తవాలు ఆకాశ హర్మ్యంలో విహరిస్తున్న తనను భూమ్మీదకు లాక్కొచ్చాయి. తన నర్సింగ్‌హోమ్‌కి ఎదురుగా ఉన్న మెడికల్ షాపు యజమాని చేసిన ప్రతిపాదనను విని 'ఇలా కూడా చేస్తారా'? అని అమాయకంగా ఆశ్చర్యపోయాడతను. 'ఇతని వ్యాపారం కోసం నేను రోజుకి పేజీలకు పేజీలు మందుల్ని అవసరం లేకపోయినా రాయాలా... ఆ లాభంలో వాటాని నాకు పంచుతాడా? ఛీ... ఎంత దారుణం?' అని ఆవేశపడ్డాడు.

తమ వీధి చివరన ఉన్న క్లినికల్ లాబ్ అధిపతి చేసిన ప్రతిపాదనకు కూడా తను ఆవిధంగానే ఆగ్రహించాడు.

"పేషెంట్‌కి టెస్ట్‌కి రాసి మీ లాబ్‌కి పంపిస్తే ఏభై శాతం కమీషన్‌ని నాకిస్తారా?

అంత కమీషన్ నాకిచ్చి మీరేం తింటారు? అసలు టెస్ట్ చేస్తారా లేక చెయ్యకుండానే రిజల్ట్స్ వేసేసి మాయ చేస్తారా?" తన దులుపుడుకు ముఖం ముడుచుకుని వెళ్లిపోయాడతను.

మరికొద్ది రోజులకే మరో చేదు సంఘటన. ఒక పల్లెటూరు నుంచి పేషెంట్‌ని తీసుకువచ్చి ఆర్.ఎం.పి జబర్దస్తీగా తన అనుమతి లేకుండా తన గదిలోకి వచ్చి తన ఎదుట కుర్చీలో దర్జాగా కూర్చున్నాడు. ఆపరేషన్‌కి పేషెంట్‌ను తీసుకు వచ్చానని చెప్పి, పేషెంట్‌కి ఏయే పరీక్షలు ఏ లాబ్‌కు రాయాలో కూడా చెప్పి, పేషెంట్‌ని తీసుకు వచ్చినందుకు తన కమీషన్ ఎంతో బైట పెట్టాడు.

"పేషెంట్‌ని పరీక్ష చేసి అసలు ఆపరేషన్ అవసరమో కాదో నిర్ణయించాల్సింది నేను. అతనికి పరీక్షలు అవసరమా కాదా. అవసరమయితే ఏ పరీక్షలు అవసరమో, వాటిని ఏ లాబ్‌లో చేయించాలో నిర్ణయించాల్సింది కూడా నేనే. ఇంక నేను చేస్తున్నది ప్రాణాల్ని కాపాడే వృత్తి. కమీషన్ వ్యాపారం కాదు." కఠినంగా అన్నాడు తను. తన ధోరణి అతనికి మింగుడు పడలేదు.

"మీకింకా కొత్త. అనుభవం లేదు. పల్లెటూళ్ళలో పేషెంట్స్‌కి మేము ఎంత చెప్తే అంత. మేము ఏ డాక్టరు దగ్గరకు వెళ్ళమంటే ఆ డాక్టరు దగ్గరకే వెళ్తారు. మీరు ప్రాక్టీస్‌లో నిలదొక్కుకోవాలంటే మా సహాయం తీసుకోవడం తప్పని సరి. అది గుర్తుంచుకోండి." బెదిరించి పేషెంట్‌ని తీసుకుని వెళ్ళిపోయాడతను.

కొద్ది రోజుల వ్యవధిలో తనను కలవర పెట్టే మరో సంఘటన జరిగింది. తన కులానికి చెందిన వ్యక్తి ఒకతను తను వారి కులం వాడేనని తెలుసుకుని ఒక కృత్రిమపు నవ్వు ముఖానికి తగిలించుకుని ప్రేమని ఒలకబోస్తూ వచ్చాడు.

"ఒకసారి మన వాళ్ళందర్నీ కలవండి. వూళ్ళో పెద్ద వాళ్ళను కలిస్తే మీకు ఎంతో అండ." అతను చెప్తుందేమిటో మొదట తనకు అర్థం కాలేదు.

"మన వాళ్ళెవరండీ? నాకు అందరూ మనవాళ్ళే" అనేశాక అతని భావమేమిటో స్ఫురించింది తనకు.

"ఈ ఊళ్లో నర్సింగ్‌హోములన్నీ కులం ఆధారంతోనే నడుస్తున్నాయి. ఏ కులం వాళ్లు ఆ కులం డాక్టర్ల దగ్గరకే వెళ్తారు. మీకు తెలియదా? కులం అండ లేకుండా మీరిక్కడ ప్రాక్టీస్ పెంచుకోగలననుకుంటున్నారా?" అయన వంక తీవ్రంగా చూచాడు తను. కులం కంపు ఎంత గాఢంగా సమాజాన్ని ఉక్కిరిబిక్కిరి

చేస్తుందో తనకు కూడా అనుభవమవుతూనే ఉంది. కానీ వ్యాధిగ్రస్తుడైన మనిషి మాత్రమే నాకు ప్రమాణం. కులం, మతం, జాతి కాదు అని నమ్ముతున్న తనీ గోడల మధ్య బందీ కాలేదు.

"మిమ్మల్ని చూస్తే నాకు జాలేస్తుంది. డాక్టరు గారూ! రోగుల పట్ల దయ, సానుభూతి చూపిస్తూ, వారికి సేవ చేస్తూ బ్రతికేసే చల్లని రోజులు ఎప్పుడో పోయాయి. ఇప్పుడు హంగు, ఆర్భాటం, ప్రచారం, కులం అండ లేకుండా నెగ్గుకు రావడం అంత సులభం కాదు. మీరు ప్రాక్టికల్‌గా ఆలోచించక పోతే ఎదుగూ, బొదుగూ లేకుండా ఇక్కడే ఆగిపోతారు. ఈ ప్రపంచం నీతి నిజాయితీ, మంచీ మానవత్వం చుట్టూ కాదు. డబ్బు, డబ్బు చుట్టూ మాత్రమే తిరుగుతూందని మీరు గుర్తించడం లేదు." అతని హితబోధ తనకు దుర్భరంగా ఉంది. ఏదో తెలియని విచారం తనను కమ్ముకుంది.

"నా నమ్మకాలు వేరు. దయచేసి నాకింకేమీ చెప్పకండి." తన ధోరణికి కుపితుడై వెళ్లిన అతను చిలవలు, పలవలు చేసి తన గురించి కుల పెద్దలకు చెప్పి వారికి తనపై వ్యతిరేక భావనను కలిగించాడని కూడా తరువాత తనకు తెలిసింది. కాని దానికి తను అంతగా ప్రాధాన్యం ఇవ్వలేదు. అప్పుడు తన లక్ష్యం సాధ్యమైనంత ఎక్కువ మందికి బాధా నివారణ చెయ్యడం. తన తపస్సు మృత్యుముఖంలో ఉన్న వారిని కాపాడడం. తన ధ్యేయం ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా సాధ్యమైనంత నీతి, నిజాయితీతో జీవించడం. ఇవి సాధించే క్రమంలో తనకు ఎన్నో అడ్డంకులు. ఎన్నో ఎదురు దెబ్బలు. ఎన్నో ఆశాభంగాలు, ఎన్నో వైఫల్యాలు, మరెన్నో విజయాలు. ఒక విధమైన నిషాతో వృత్తి జీవితాన్ని నిర్మించుకుంటున్న తను వృత్తి జీవితాన్ని, వ్యక్తిగత జీవితాన్ని సమన్వయ పరచుకోవడంలో విఫలమై తన భార్యబిడ్డల అసంతృప్తికి గురయ్యాడు.

తన జీవితం తీపిగా, వగరుగా, చేదుగా సాగిపోతున్న దశలో మరొక చిత్రమైన అనుభవం ఎదురయింది. తమ కంపెనీ మందుల్ని మాత్రమే ఎక్కువెక్కువగా రాస్తే మారుతీ కారును బహుమతిగా ఇస్తామనే ప్రతిపాదనతో వచ్చారు ఒక మందుల కంపెనీ వాళ్ళు. కలర్ టి.వి., వి.సి.ఆర్, ఫ్రిజ్ మొదలైన బహుమతుల్తో డాక్టర్స్‌ని కొనే ప్రయత్నాల గురించి ఇదివరకే విని ఉన్నాడు కనుక పెద్దగా ఆశ్చర్యపోలేదు. తన 'తిక్క,చాదస్తం' గురించి తెలిసిన వారెవరూ ఇంతకు ముందిలాంటి ప్రతిపాదనతో తన దగ్గరకు రాలేదు. కాని ఇప్పుడీ కంపెనీ వాళ్ళిలా వచ్చారంటే భారీ లంచంతో తనను కొనగలమని వాళ్ళ ధీమా అయియుండాలి.

ముందు తను శాంతంగా నిరాకరించాడు. తనకిలాంటి విషయాలు ఇష్టం ఉండవని స్పష్టంగా చెప్పాడు.

అయినా పట్టువిడవకుండా అందులో తప్పేమీ లేదని, చాలామంది డాక్టర్లు తమతో సహకరిస్తున్నారని వాదిస్తుంటే తనకు విపరీతమైన కోపమొచ్చింది. ఎక్కడోనూటికో, కోటికో ఒకరు చేస్తున్న తప్పును చాలా మందికి, లేక అందరికి ఆపాదించి నిందించడం ఫాషనయిపోయింది. తన మట్టుకు తనను ఎంతో మంది ఎన్నో విధాల ప్రలోభ పెట్టారు. ఒక్కొక్కరు ఒక్కొక్క పరిమితి దగ్గర వ్యామోహాలకు లొంగిపోతూ ఉండిఉండొచ్చు. అలా లొంగి పోయేందుకు ఒత్తిడి చేస్తూంది మళ్ళీ ఈ చుట్టూ ఉన్న వాళ్ళే. పాకుడు రాళ్ళ మీద జారి పోవడానికి ప్రయాస అఖ్ఖర్లేదు. విలువల శిఖరాల్ని చేరాలంటేనే ఒక్కొక్క మెట్టు దగ్గర ఎంతో పోరాటం, ఎంతో ఆత్మనిగ్రహం, ఎంతో శక్తి కావాలి.

"రామకృష్ణా...!" డా. రజని పిలుపుతో రామకృష్ణ ఇహ లోకంలోకి వచ్చాడు. రజని రామకృష్ణకు మెడిసిన్ చదువుతున్నప్పుడు క్లాస్‌మేట్. ఈ ఊళ్ళోనే ప్రాక్టీస్ చేస్తూంది. తండ్రిని కోల్పోయిన కుటుంబానికి పెద్ద దిక్కయి బాధ్యతల్ని నిర్వర్తిస్తూ చివరకు అవివాహితగా, ఒంటరిగా మిగిలిపోయిన రజనికి ప్రాక్టీస్, రామకృష్ణ కుటుంబంతో స్నేహం తప్ప ఈ ఊళ్ళో మరో ప్రపంచం లేదు.

"ఏం జరిగింది కృష్ణా? ఈ పేపర్లో రాసిన చెత్తంతా ఏమిటి?" రజని ప్రశ్న వినేసరికి రజనితో పాటు అనేక వేలమంది ప్రజలు ఈపాటికీ సంచలన వార్తను చదివి తన గురించి చెడుగా అనుకుంటూ ఉండి ఉంటారని గుర్తొచ్చి క్రుంగి పోయాడు రామకృష్ణ. అతనిలోని ధైర్యం, ఆవేశం జారిపోయి శక్తిహీనుడిలా కూర్చున్నాడు. తను కట్టుకున్న స్వప్నసౌధాలు కూలిపోతున్నట్లు, తను పెంచిన నందనవనాలు తగలబడిపోతున్నట్లు అనిపిస్తూంది.

"అసలు జరిగిందొకటి, వీళ్ళు రాసింది మరొకటి రజనీ...!" తన ఆలోచనల్ని, ఆశయాల్ని అర్థం చేసుకుని, గౌరవంతో ప్రోత్సహించే ఆప్తమిత్రురాలి సమక్షంలో అతని వేదన కరుగుతూంది.

"ఏమిటో ఇవాళ వదిన గారికి ప్రొద్దున్నే గుర్తుకొచ్చాం...!" అంటూ రామకృష్ణ భార్య జ్యోతి తనూ ఒక కుర్చీ దగ్గరకు లాక్కుని కూర్చుంది. ఇద్దరి ముఖాల్ని చూచి ఏదో జరిగిందని గ్రహించిందామె. రామకృష్ణ అందించిన పేపర్‌లోని వార్తను చదివి నొసలు చిట్లించింది జ్యోతి.

"ఇదేమిటి వదినా! ఇలా రాశారు? ఆ రోజు బాబును చూడడానికి వైజాగ్ వెళ్దామని బయల్దేరాక చావు బ్రతుకుల్లో ఉన్న ఆ పిల్లాడిని తీసుకువచ్చారు. అప్పటికి నాలుగుసార్లు బాబుకు వస్తున్నామని ఫోన్ చేసి చెప్పి తీరా ప్రయాణమయాక ఏదో ఒక కేస్ వచ్చి ఆగిపోయాము. వస్తామని చెప్పి వెళ్ళకపోతే వాడికెలా ఉంటుందో చెప్పు! పైగా ముందు రోజు రాత్రి ఫోన్ చేసినప్పుడు వాడికి ఒంట్లో అంత బాగా లేదని కూడా వార్డెన్ చెప్పాడు. పిల్లాడి కోసం మళ్ళీ ప్రయాణం ఆపు చేస్తారేమోననే భయంతో నేనా కేసు తీసుకోవద్దని, పంపించెయ్యమని పోరాను. బాబు మన కోసం ఎంతో ఆశతో ఎదురుచూస్తూ ఉంటాడని, బాబును చూడడానికి నా ప్రాణం కొట్టుకుపోతూందని బ్రతిమాలాను. కాని కళ్ళు తేలేసిన ఆ పిల్లాడిని చూచి ఈయన ఆగిపోయారు. వెంటనే ట్రీట్‌మెంట్ ఇవ్వకపోతే ఆ అబ్బాయి బ్రతకడని, మరొక డాక్టరును వెదుక్కుని వెళ్ళేలోగా పరిస్థితి ఇంకా విషమిస్తుందని చెప్పి ప్రయాణం ఆపుచేశారు. లక్షన్నొకటోసారి డాక్టర్ని పెళ్ళి చేసుకునే బుద్ధితక్కువ పని చేసినందుకు చెంపలు వాయించుకుని ఇంట్లోకి వెళ్ళాను." తన ఆశాభంగాల్ని తలచుకుని భర్తపై చిటపటలాడే జ్యోతికి ఒక ప్రాణాన్ని నిలపడం కోసం అతను పడే తాపత్రయాన్ని చూచి అంతరాంతరాల్లో ఎంతో గౌరవం. వాంతులు, విరేచనాలు, తీవ్రమైన డీహైడ్రేషన్‌తో వచ్చిన ఆ పిల్లాడిని బ్రతికించడం కోసం రెండు రోజులు ఎంతో శ్రమించిన తన భర్తపై ఇంత నింద రావడం ఆమెకు బాధను కలిగిస్తూంది.

"గాస్ట్రోఎంటిరైటిస్, సివియర్ డీహైడ్రేషన్‌తో పేషెంట్‌ని తీసుకొచ్చారు రజనీ! అన్నీ తగ్గి వాడు కోలుకోవడానికి అయిదు రోజులు పట్టింది. మర్నాడు డిశ్చార్జి చేసేస్తానని కూడా చెప్పాను. ఆరోజు ఆదివారం, ఎమర్జన్సీ ఏమీ లేదుకదా అని బాబు దగ్గరకు వెళ్ళాము. మేము వైజాగ్ నుండి తిరిగొచ్చే సరికి ఆ అబ్బాయి అకస్మాత్తుగా పోయాడని, వెంటనే శవాన్ని తీసుకువెళ్లిపోయారని చెప్పారు మా స్టాఫ్. అంత అకస్మాత్తుగా, మళ్ళీ ఏ బాధా లేకుండా, వాడెలా చనిపోయాడా అని నిన్నటి నుండి అంతుపట్టక చచ్చిపోతున్నాను. ఈ రోజు తెల్లారేసరికి పేపర్ వార్త! నా నిర్లక్ష్యం వల్ల, తప్పుడు వైద్యం వల్ల పేషెంట్ చనిపోయాడని రాశారు." అతి దీనంగా, జాలిగా చెప్తున్నాడు రామకృష్ణ.

"ఈ బాధ, ఈ సున్నితత్వం మొదటిసారే ఉంటాయి. ఈ ఒక్క సంఘటనతో మనం రాటుదేలిపోతాము. ఏ తప్పూ చెయ్యకుండానే మన నిర్దోషిత్వాన్ని మనం రుజువు చేసుకోవలసిన దయనీయమైన పరిస్థితి నుంచి బైటపడేసరికి మనం

మనంగా మిగలం." తనకు తనే చెప్పుకుంటున్నట్లు చెప్తూంది రజని. దాదాపు సంవత్సరం క్రితం జరిగిన సంఘటన అప్పుడే తన ముందు జరుగుతూందన్నంత సజీవంగా కళ్ళెదుట నిలిచింది.

రజని నర్సింగ్‌హోమ్‌లో బాల్యం ఇంకా వీడని గర్భిణి పురుటి నొప్పుల్తో చేరి ప్రసవమయ్యాక విపరీతమైన రక్తస్రావమయి చనిపోయింది. ఆమె మరణం రజని హాస్పటల్లో ఒక ప్రళయాన్నే సృష్టించింది. ఆమె శవాన్ని తీసుకువెళ్ళకుండా ఆమె బంధువులు కొంతమంది రజని గదిలోకి జొరబడి ఆమెను దూషించడం మొదలుపెట్టారు. ఆ అమ్మాయి ప్రాణాల్ని రక్షించలేకపోవడానికి కారణమయిన పరిస్థితుల్ని తలచుకుని బాధపడుతున్న రజని వాళ్ళ ఆరోపణల్ని విని నిర్ఘాంత పోయింది.

"మా పిల్లను నువ్వే చంపావు." వాళ్ళంటున్నదేమిటో అర్థంకావడానికి కొంచెం సమయం పట్టింది.

"నేను మీ పిల్లను చంపడమేమిటి? నేనిక్కడ వుంది మనుషుల్ని బ్రతకించ డానికే గానీ చంపడానికి కాదు. ఆ అమ్మాయి ఏ పరిస్థితిలో ఇక్కడకు వచ్చిం దసలు?" ఇన్ని గంటల నుండి వేరే పని చూడకుండా ఆ అమ్మాయి దగ్గరే ఉండి కదలకుండా తన శక్తివంచన లేకుండా ప్రయత్నించిన తన నా విధంగా దూషిస్తూంటే సహించదలచలేదు రజని.

"బంగారమంటి పిల్లని హాస్పటల్‌కి ధారబోసాము. ఇరవై నిండకుడానే నూరేళ్ళు నిండాల్సి ఉండే, పిల్లనీ పాడు హాస్పటల్‌కి తీసుకొచ్చాం." శోకాలు పెడుతూంది ఒకావిడ.

"ఆ అమ్మాయిని ఇదే మొదటిసారి నా దగ్గరకు తీసుకురావడం. మనిషి తెల్లగా పాలిపోయి, ఒళ్లంతా ఉబ్బిపోయి ఉంది. బి.పి. ఎక్కువగా వుంది. అంత పసిదానికి పెళ్ళి చేసి చేతులు దులుపుకున్నారు కానీ గర్భం వస్తే ఒక్కసారన్నా డాక్టరుకు చూపించలేదు. కనీసం సరైన తిండన్నా పెట్టారా? ఇంత ప్రమాద పరిస్థితిలో తీసుకొచ్చి, రక్తం కోసం పంపిన వాళ్ళింతవరకు అజాపజా లేక, పరిస్థితి చెయ్యిదాటిపోతే, ఎవరు ఆమె చావుకు బాధ్యులు? నేనేమన్నా దేవుణ్ణా అలా ప్రాణం పోసేసి బ్రతికించేయడానికి?!" ఆమె చెప్తున్న అప్రియసత్యాలు వాళ్ళకు రుచించలేదు. తాము దాడికి దిగితే పిల్లిలా బెదిరిపోతుందనుకున్నారు కాని ఇలా నదురు, బెదురు లేకుండా జవాబిస్తుందని వాళ్ళు ఊహించలేదు.

"మనుషుల ప్రాణాలతో చెలగాటమాడే ఈ డాక్టర్లకు బుద్ధి చెప్పేవాళ్ళు లేక ఇలా నిర్లక్ష్యంగా ప్రాణాలు తీస్తున్నారు." రౌద్రంగా అన్నాడు మరొకతను.

"అర్థం లేకుండా మాట్లాడకండి. ముందిక్కడ నుండి బైటకు నడవండి." ఆగ్రహంతో గర్జించిన రజనిని దూషిస్తూ, అరుస్తూ బయటకు వెళ్లారంతా.

కాసేపటికి ఇరవైవేలిస్తే మరింకేం అల్లరి చేయకుండా శవాన్ని తీసుకు వెళ్తామని రజనికి కబురు పంపారు. రజనికి విపరీతమైన కోపమొచ్చింది. అంతులేని దుఃఖమొచ్చింది. తనను ఆ అమ్మాయి చావుకు బాధ్యురాల్ని చేసి దోషిగా నిలబెట్టి నప్పుడు కూడా అంత బాధ కలగలేదు. తమ మనిషి పోయిందన్న దుఃఖంతో, అజ్ఞానంతో అలా ఆగ్రహిస్తున్నారని సరిపెట్టుకుంది. కాని ఈ దిగజారుడుతనానికి, శవంతో బేరాలు చేస్తున్న ఈ నైచ్యానికి తట్టుకోలేకపోతూంది. క్రమేపీ మానవీయ విలువలతో కూడిన సమూహాలస్థానే డబ్బు పిశాచాలు నాట్యమాడుతున్నాయనే వాస్తవం ఆమెకు భీతిని కలిగించింది. సమయానికి రామకృష్ణ కూడా ఊళ్లో లేకపోవడం వల్ల, మరెవరితోనైనా చెప్పుకోవడానికి చిన్నతనమనిపించి ఒంటరిగా ఎదుర్కోవడానికే సిద్ధపడింది. వారికి తను డబ్బివ్వాల్సిన పనేమీ లేదని ఒక్క పైసా కూడా ఇవ్వనని స్పష్టంగా చెప్పింది. ఆమె డబ్బివ్వలేదన్న కోపంతో రెచ్చిపోయి హాస్పిటల్ మీద దాడికి దిగి అన్నీ పగులగొట్టి, ఫర్నిచర్‌ని, వస్తువుల్ని ధ్వంసం చేసి భయానక వాతావణాన్ని సృష్టించి పేషెంట్స్ అంతా హడిలిపోయేలా చేశారు. రజని పై భౌతికంగా దాడికి దిగే సమయంలో పోలీసులొచ్చారు.

మరునాడు పత్రికల్లో ప్రముఖంగా ఈ వార్తను ప్రచురించారు. లేడీ డాక్టర్ అసమర్థత, నిర్లక్ష్యం కారణంగా ఒక గర్భిణి మృతి చెందిందని, డాక్టర్ డిమాండ్ చేసినంత ఫీజుని ఆ పేదరాలు చెల్లించలేని కారణంగా చికిత్సలో జాప్యం జరిగి ఆమె చనిపోయిందని, కోపించిన బంధువులు లేడీ డాక్టర్‌పై దాడికి దిగారని, ఆకర్షణీయమైన ఒక చిన్న కథను సృష్టించి రాశారు. వాళ్ళు దాడికి దిగిన సమయం లో చాలా ధైర్యంగా ఎదుర్కొన్న రజని తరువాత అవమాన భారంతో క్రుంగిపోతూ పిరికిగా తయారయింది. ఇప్పుడీ పేపర్స్‌లో వార్తను చూచాక భూమి రెండుగా చీలిపోయి తనను దాచుకుంటే బావుండుననిపించింది. ఒకొక్కరు పరామర్శకు వస్తూంటే వారి సానుభూతి వెనుక ఉన్న హేళన, వారి పెదాల వెనుక ఉన్న వంకర నవ్వు చూచి తెగ బాధపడిపోయింది. అందరూ తననో అపరాధిగా, హంతకురాలిగా భావిస్తున్నట్లు ఊహించుకుని అస్థిమితంగా తిరుగుతూ ఏ పని మీదా మనసును లగ్నం చెయ్యలేకపోయింది. ఈ క్షోభ నుండి బయటపడి ఆమె

మామూలు మనిషికావడానికి కొన్ని నెలలు పట్టింది. అప్పటికామె పూర్వపు రజని కాదు. పూర్వపు రజనిది ఇతరుల బాధకి, కష్టానికి ఇట్టే ప్రతిస్పందించే హృదయం. ఇప్పుడామె హృదయం మొద్దుబారిపోయింది. పూర్వం మృత్యుముఖంలో ఉన్న రోగిని వాళ్ళిచ్చే ఫీజు సంగతి ఆలోచించకుండా, మందులు తెచ్చుకుంటానికి డబ్బు, వ్యవధి లేకపోతే తన దగ్గరున్న మందులు వాడి కాపాడడానికి తన సర్వశక్తుల్నీ వినియోగించిన రజని ఇప్పుడు సీరియస్ కేసుల్ని తీసుకోవడం లేదు. పడీ పడీ నిద్రాహారాలు లేకుండా చేసి, ఒకవేళ తన ప్రయత్నం విఫలమై రోగి చనిపోతే విచారంతో ఊరుకుంటే ఫరవాలేదు. చనిపోయిన పేషెంట్ దగ్గర ఫీజే తీసుకొని తాను ఫీజు కోసం రొక్కించిందనో, నిర్లక్ష్యం చేసిందనో, తన అసమర్థత కారణంగా పేషెంట్ పోయిందనో నింద, ఎందుకొచ్చిన టెన్షన్ తనకి అనే మనస్తత్వం వచ్చింది.

ఒక్కసారి అదంతా గుర్తుకొచ్చింది రజనికి. ఆ రోజు తన మీద అన్యాయంగా దాడికి దిగి భౌతికంగా, మానసికంగా నష్టాన్ని కలిగించిన రౌడీలు కుల పెద్దల అండతో, డబ్బు మహాత్మ్యంతో శిక్ష లేకుండా తప్పించుకుని మామూలుగా తిరుగుతున్నారు. తనకుమాత్రం మచ్చ మిగిలింది.

"అసలా పిల్లాడి తల్లిదండ్రులు పేపర్ వాళ్ళతో ఇంత అబద్దాన్నెందుకు చెప్పారు? ఒకవేళ వాళ్ళు చెప్పినా నన్ను కూడా అడిగి నిజమేమిటో తెలుసుకుని వార్త ప్రచురించాలనే కనీస మర్యాదనెందుకు పాటించలేదీ పేపర్ వాళ్ళు!!" ఆవేదనగా అన్నాడు రామకృష్ణ.

"వాళ్ళకు కావలసింది సంచలన వార్త. ఇది మనల్నెంతగా గాయపరుస్తుందో వాళ్ళకి అర్థం కాదు." అంది రజని.

"ఇన్నేళ్ళ ప్రాక్టీస్‌లో మీరు ఎవరికీ అంతుపట్టని ఎన్నో కేసుల్ని నయం చేశారు. ఎంతోమంది సీరియస్‌గా ఉన్న రోగుల్ని చావకుండా కాపాడారు. ఉన్న డబ్బంతా మందులకు మాకులకు అయిపోతే... తోచిందేదో చేతిలో పెట్టి దణ్ణం పెట్టి వెళ్తే మారుమాట్లాడకుండా ఊరుకున్నారు. ఇంత చేస్తున్న మీ గురించి ఎప్పుడైనా ఒక్కసారైనా పేపర్లో ఏదో ఒక మారుమూల రెండు ముక్కలన్నా మంచిగా రాశారా? ఇప్పుడీ అభూత కల్పనను మాత్రం ప్రముఖంగా ప్రచురించారు. రేపెప్పుడైనా నిజం తెలిశాక యిది అబద్ధమే అని రాసినా ఇప్పుడు జరిగిన హాని సమసి పోతుందా? ఇప్పుడు మీరు అనుభవిస్తున్న మానసిక క్షోభ మాటేమిటి?" తన

గురించి బాధపడుతూ మాట్లాడుతున్న భార్య వంక ఆర్ద్రంగా చూసాడు రామకృష్ణ.

"నిజం తెలుసుకుని వార్త రాయాలి. తొందరపడి, అబద్దాలతో ఒక వ్యక్తిపై బురద జల్లకూడదు. అంత వరకు ఒప్పుకుంటాను. కానీ నేను రోగులకు చేసింది నావృత్తి ధర్మాన్ని సక్రమంగా నిర్వర్తించడం. సహజంగా జరగాల్సింది జరిగితే అది వార్తెలా అవుతుంది?" అంత బాధలోనూ విచక్షణ కోల్పోని రామకృష్ణ వంక అభిమానంగా చూచింది రజని.

"అసలు మన విషయంలో సమాజంలోని అన్ని వర్గాల ప్రజల్లోనూ ఇంత వ్యతిరేక స్పందన ఉండడానికి కారణమేమిటి? మనం ఆత్మ పరిశీలన చేసుకోవల సిన అవసరముంది కృష్ణా! మన ప్రవర్తన, మన జీవిత విధానం కోపాన్ని, అసూయను ప్రేరేపించేలా వున్నాయా? వాటి ఫలితమేనా ఈ దుష్పరిణామాలన్నీ? లేక సర్వవ్యాప్తంగా వున్న క్షీణ విలువలు. దిగజారిన నైతిక ప్రమాణాల వల్లే ఇంత సంఘర్షణ పుడుతూందా? "

రజనికి రామకృష్ణ జవాబిచ్చేలోగానే ఇద్దరు పురుషులు గేటు తీసుకుని లోపలకు వచ్చారు. వాళ్ళు చెప్పింది విన్నాక ముగ్గురి గుండెలు భగ్గుమన్నాయి. చనిపోయిన పిల్లాడి తండ్రి వినియోగదారుల కోర్టులో డాక్టర్ రామకష్ణ నిర్లక్ష్యం, తప్పుడు ట్రీట్‌మెంట్‌తో తన కొడుకు చనిపోయాడని, తమకు పదిలక్షలు నష్టపరి హారం యిప్పించి న్యాయం చేకూర్చవలసిందని కేస్ వేశాడట. కోర్టు బైట సెటిల్ చేసుకుని, మరింత అల్లరి పడకుండా రాజీ పడాలంటే ఐదు లక్షలు చెల్లించాలని కబురు తెచ్చారు.

అప్పటికే అవమానంతో దగ్ధమవుతున్న రామకృష్ణ పిడుగు దెబ్బ తిన్న వాడిలా కూర్చున్నాడు. తను చెయ్యని నేరానికి తను నష్టపరిహారం చెల్లించాలా? పేపర్లో, వార, పక్ష, మాస పత్రికల్లో డాక్టర్లని వినియోగదారుల చట్ట పరిధిలో చేర్చే విషయం పై చర్చ జరగుతున్నప్పుడు, డాక్టర్స్ ఆధ్వర్యంలో సదస్సు జరిగినప్పుడు తను డాక్టర్లని వినియోగదారుల చట్ట పరిధిలోకి తీసుకురావాలని చెప్పి తన డాక్టర్ మిత్రులందరితో తిట్లు తిన్నాడు. వైద్య వృత్తి వ్యాపారం కాకుండా వుండడానికి, రోగికి డాక్టర్లు జవాబుదారీ వహించడానికి, నిర్లక్ష్యం మోసం, లోపభూయిష్టమయిన చికిత్సతో రోగికి నష్టం కలిగించే డాక్టర్స్‌ని అదుపుచెయ్యడానికి డాక్టర్లని ఈ చట్టంలో చేర్చుడం అవసరమే అని తను వాదించాడు. పైగా తప్పులు చేసేవాడికి కదా శిక్ష పడేది. తప్పుచెయ్యనంత వరకు మనకెందుకు భయం? అని 'లా' పాయింట్

లేవనెత్తాడు. మన నిర్లక్ష్యానికి గురయిన రోగులు నిస్సహాయంగా వూరుకోవలసిందేనా? న్యాయాన్ని కోరే అవకాశం వాళ్ళకు ఉండనవసరం లేదా? అని ప్రశ్నించాడు.

ఇప్పుడు తనదాకా వచ్చాక కత్తికి రెండో వైపున కూడా ఉన్న పదును అనుభవంలోకి వస్తూంది. ఆ పదును అమాయకుల కుత్తుకల్నెలా ఉత్తరించగలదో కూడా తెలుస్తూంది. మంచికి ప్రతిఫలం మంచే కానఖ్ఖర్లేదనీ, అవకాశం వుండాలే కాని ఎవరు ఎవర్నయినా దోపిడీ చేసేందుకు వెనుకాడరని తెలిసొచ్చింది. దురాశ, స్వార్థం మనిషినెంత క్రూరుడిని చెయ్యగలవో ఆ క్రూరత్వానికి సాధు జంతువులెలా బలి కాగలవో కూడా గుర్తిస్తున్నాడు. సవ్యంగా ప్రవర్తించని డాక్టర్స్‌ని అదుపు చేసి దారిలో పెట్టే ప్రయత్నంలో కన్నబిడ్డల శవాలతో బేరాలాడేందుకు అవకాశం కలిగించడాన్ని ఆమోదించలేకపోతున్నాడు. నమ్మకం, సానుభూతి, ఆత్మీయత, అనుబంధం, గౌరవం ఉండవలసిన చోట మోసం, అపనమ్మకం, బ్లాక్‌మెయిలింగ్... ఎంత దురదృష్టకర పరిణామం?

"కన్స్యూమర్ కోర్టులో కేస్ వేశామంటున్నారు కదా! కోర్టు తీర్పు రానివ్వండి బయట సెటిల్ చేసుకునేందుకు మీకు డబ్బిచ్చే ప్రసక్తే లేదు. వెళ్ళండి." కటువుగా చెప్పి వాళ్లను తరిమేశాడు. కానీ హృదయమంతా నిండిన అశాంతిని తరిమేయలేక స్థిమితం లేకుండా పక్కనే ఉన్న హాస్పటల్‌కు, ఇంటికి మధ్య తిరుగుతున్నాడు రామకృష్ణ. అతనికి ధైర్యం చెప్పి పేషెంట్స్‌ని చూచి మళ్ళీ వస్తానని చెప్పి వెళ్ళింది రజని.

సాయంత్రానికల్లా రామకృష్ణ యింటి ముందు రోడ్డువార టెంట్ వెలిసింది. రామకృష్ణ గురించి అరుస్తూ నినాదాలు చేస్తున్నారు కొంతమంది. కోర్టు తీర్పు వచ్చే దాకా ఓపిక పట్టలేక, ఈ లోపే తన దగ్గర సామ, దాన, భేద దండోపాయాల్లో డబ్బు గుంజాలని ప్రయత్నిస్తున్న వారి కుత్సితాన్ని, అతి వేగంగా అదుపు తప్పిపోతున్న పరిణామాల్ని చూచి రామకృష్ణ విభ్రాంతి నుండి తేరుకోలేకపోయాడు. అతనెప్పుడూ తన కులం వారితో అంటుకుని తిరగకపోయినా అతని కులంతో పగ వున్న మరో కులం వారు, అతన్ని డబ్బు ప్రలోభంలో పడేసి తద్వారా తాము లాభం పొందడంలో విఫలమైనవారు, అతని ప్రాక్టీస్‌ను చూసి అసూయపడుతున్న వారు అందరూ కలిసి ఐకమత్యంగా అకస్మాత్తుగా దీనజన రక్షకులైపోయారు. వారి ప్రోద్బలంతో తరలివచ్చిన ప్రదర్శకులు కన్నబిడ్డను కోల్పోయిన ఆ తల్లిదండ్రులకు న్యాయం చెయ్యాలని, ఆ బిడ్డ చావుకు కారకుడయిన వ్యక్తిని శిక్షించాలని గోల గోల చేస్తున్నారు.

ఈ రభస గురించి తెలిసిన కొంత మంది మిత్రులు, రజని, మరికొంత మంది డాక్టర్లు రామకృష్ణ దగ్గరకు వచ్చారు. ప్రదర్శకుల ఆవేశం చూస్తే వాళ్ళే క్షణంలోనైనా గేటు లోపలకు ప్రవేశించి విధ్వంసానికి పాల్పడేలా ఉన్నారు. పోలీసులకు ఫోను చేసి ఆందోళనగా ఎదురు చూస్తున్నాడు రామకృష్ణ.

ఇంతలో హాస్పటల్‌కి, ఇంటికి మధ్య వున్న ద్వారం గుండా లోపలికి వచ్చిందో యువతి. భయం భయంగా ఇంటి వరండాలోకి వచ్చి డాక్టర్ రామకృష్ణగారితో మాట్లాడాలని అంది. ఇప్పుడు డాక్టరుగారు మాట్లాడే పరిస్థితిలో లేరని, తరువాత వచ్చి కలవమని ఎంత చెప్పినా వినకుండా డాక్టర్‌గారిని తక్షణం కలవాలని పట్టుపట్టింది. విధిలేక బయటకు వచ్చిన రామకృష్ణ ఆమెను చూచి ఆశ్చర్య పోయాడు.

"ఎవరమ్మా నువ్వు? డాక్టర్ గారితో ఏం మాట్లాడాలి?" తలదించుకుని దీనంగా నిలబడిన ఆమె రజని ప్రశ్నలతో తలెత్తింది. నెమ్మదిగా, స్పష్టంగా జవాబిచ్చింది.

"అక్కడ అరుస్తున్న బేవార్సు సన్నాసులంతా డాక్టరు గారు చంపారని అంటున్నారే ఆ బిడ్డ నా బిడ్డేనమ్మా!" ఆమె చెప్పింది విని ఆమె ఎందుకు వచ్చిందో అర్థంకాక తెల్ల బోయి చూస్తున్నారంతా.

"చేసింది చాలక ఇంకా ఏం చెయ్యాలని ఇక్కడకు వచ్చావు?" కోపంగా అడిగింది జ్యోతి. ఉబికి వస్తున్న కన్నీటిని పయిట చెంగుతో తుడుచుకుంటూంది ఆ అమ్మాయి, కమల.

"నేనేం చెయ్యాలో అది చెయ్యడానికే వచ్చానమ్మా" ఒక క్షణం ఆగి తనను తాను కూడదీసుకుందామె.

"డాక్టరుగారు బ్రతికించిన నాబిడ్డను చంపింది మా ఆయన." మాటలు పేర్చుకుంటూ చెప్తున్న ఆమె కంఠం దుఃఖంతో పట్టేసింది. చేష్టలు దక్కి చూస్తూన్నారంతా.

"మీరు నమ్మడం లేదు కదూ! నేను నిజమే చెప్తున్నాను. చనిపోయిన నా బిడ్డసాక్షిగా చెప్తున్నాను. వాడి ప్రాణాలు తీసింది వాడి తండ్రే. వాడు తనకు పుట్టలేదనే దుర్మార్గపు అనుమానంతో కన్నతండ్రి నా చిన్నాను పొట్టన పెట్టు కున్నాడు." చెప్తూనే భోరున విలపించ సాగిందామె. జ్యోతి, రజని ఆమెను పొదివి

పట్టుకుని ఓదార్చసాగారు. ఆమె చెప్తున్న విషయం తెలుసుకున్న ప్రదర్శకుల నోళ్లు మూతపడ్డాయి.

"నా బిడ్డను ఆ కటికాడు చంపడం నా కళ్ళారా చూచాను. ఆ ఘాతుకానికి అడ్డుపడిన నేను దెబ్బలు తిని స్పృహ లేకుండా పడిపోయాను. తెలివిరాగానే ఈ విషయం బయటకు పొక్కిందంటే నన్ను, మిగిలిన ఇద్దరు బిడ్డల్ని కూడా చంపి పారేస్తానని బెదిరించాడు. బిడ్డపోయిన దుఃఖం, ఎటూ ఏ దిక్కు, ఏ అసరాలేదు. ఏమీ చెయ్యలేని చేతకాని తనంతో, బ్రతుకు భయంతో మూగదానిలా పడి వున్నాను. కానీ రక్తం రుచి మరిగిన పులి, దేవుడు లాంటి డాక్టరుగారి మీదకిలా ఎగబడుతుందని అనుకోలేదు. ఇంత దుష్ట పన్నాగంతో బిడ్డను చంపడానికి హాస్పటల్ రూమ్‌ని ఎన్నుకున్నాడని తెలుసుకోలేకపోయాను." కమల వంక మతిపోయి చూస్తున్న వారందరిలో కొద్దికొద్దిగా చలనమొస్తూంది. రామకృష్ణ హృదయంలో ఘనీభవిస్తున్న నైరాశ్యం కరుగుతూంది.

"డాక్టర్‌గారి మీద కేసు, కోర్టు బైట రాజీపడడానికి బేరం పెట్టడం, నా కొడుకు ప్రాణానికి ఖరీదు కట్టడం... ఎంత దుర్మార్గం! ఎంత డబ్బు చనిపోయిన నాబిడ్డకు సమానమవగలదు? ఎంత డబ్బు నా కడుపు శోకాన్ని తీర్చగలదు?" దీనంగా, జాలిగా, రెక్కలు విరిగిన పక్షికూనలా రోదిస్తున్న కమలను ఓదారుస్తూ రజని, జ్యోతి కన్నీళ్ళను ఆపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

అంతలో జనం గేటు తెరుచుకుని లోపలకు వచ్చారు. ఆవేశంతో కాదు, ఆశ్చర్యంతో, ఆలోచనతో వరండాని సమీపించారు.

హిమాలయమంత ఎత్తుగా కనిపిస్తున్న కమల వంక అత్యంత గౌరవంతో చూస్తున్నాడు రామకృష్ణ. ఇంతవరకు తనకు తాను గొప్పదనాన్ని ఆపాదించుకుని, తనకెదురైన చిన్న చేదు అనుభవాన్ని భూతద్దంలో పెట్టి చూస్తూ తనేదో ఘోరమైన అన్యాయానికి గురయినట్లు బాధ పడిపోతున్నాడు తను. ఇప్పుడు న్యాయాన్ని నిలపడం కోసం, సత్యాన్ని సజీవంగా వుంచడం కోసం, అతి సామాన్యురాలైన ఈ యువతి చేస్తున్న త్యాగం ముందు తన జీవితం, తన ఆదర్శాలు, తన పరాభవం అర్థం లేనివిగా కనిపిస్తున్నాయి.

ఆమె ముందు తనో మరుగుజ్జులా ఫీలవుతున్నాడు రామకృష్ణ.

"ఈ డాక్టరుగారు కాక మరొక కర్కోటకుడైన డాక్టరుకిలా అయితే నాకింత

తెగింపు వచ్చి ఉండేది కాదేమో! కాని దయ, దాక్షిణ్యం, మంచితనం వున్న ఈ డాక్టరు గారిని ఏ తప్పూ చెయ్యకుండానే అందరూ ఇలా అవమానిస్తూ ఉంటే ఇంత మంచాడి పరువు, ప్రతిష్ట కంటే ఆ దుష్టుడితో కాపురం, అర్థం పరమార్థం లేని నా బ్రతుకు ముఖ్యం కాదనిపించాయి."

ఆత్మతేజంతో వెలుగొందుతున్న ఆమెను చూస్తూ ఉద్వేగంతో చలించి పోతున్నాడు రామకృష్ణ. అతనికి ఊహ తెలిశాక ఎన్ని కష్టాల్లోనూ, ఎంత దుఃఖం లోనూ, కంటతడి పెట్టని వాడు ఇప్పుడు మొట్ట మొదటిసారి కన్నీళ్ళు పెట్టుకుంటు న్నాడు. తన నమ్మకం తప్పుకాదు, "నేను మంచిని, మానవత్వాన్ని పరిమళింప జేస్తే ఆ సుగంధం లోకంలో సుళ్ళు తిరిగి రెట్టింపై నన్ను చుడుతుంది." అన్న తన నమ్మకం కేవలం ఒక స్వాప్నికుడి ఊహకాదు.

"దేవుడిలాంటి ఈ డాక్టరుగారి లాంటి వారికి యిలాంటి శిక్షలు వేస్తే మంచి, మానవత్వం ఈ లోకంలో ఈ మాత్రంగానైనా బ్రతికుంటాయా? ఇలాంటి వాళ్ల మంచిని బ్రతకించుకోకపోతే దుష్టులు, దుర్మార్గులు, మోసగాళ్ళు, స్వార్థపరుల్తో ఈ ప్రపంచం నిండిపోదా? అప్పుడు దీనులు, దుఃఖితులు అయిన నాలాంటి వారికి అండగా ఎవరు మిగుల్తారు?" కమల ప్రశ్నలు ఆవరణ అంతటా ప్రతిధ్వనిస్తూ అందరి గుండెల్నీ బలంగా తడుతున్నాయి.

- *'ఆంధ్రజ్యోతి' వీక్లీ, 1994.*